# అయినవాళ్ళు

పి.వి.బి. శ్రీరామమూర్తి



పెట్టుకున్న పి. ఎఫ్. లోన్‌కి కారణం సరియైనది కాదంటూ గ్రాంటుచెయ్యకుండా పై ఆఫీసు వాళ్లు త్రిప్పికొట్టేసరికి రామచంద్రం ముఖం పాలిపోయింది కొంతసేపు తరువాత పూర్తిగా నల్లబడిపోయింది. వేసవి సెలవలకి అలా తిరిగి రావాలనుకున్న తన పథకం తావకారిపోయింది బండెడు సంతోషంతో జనవరి నుంచి మే నెల కోసం ఎదురుచూస్తున్న జానకికీ విషయం తెలిస్తే బాధపడుతుంది. పరుగెడుతున్న గుర్రానికి కాళ్లు తెగకోసినట్లవుతుంది. పై ఆఫీసు వాళ్లమీద రామచంద్రానికి పీకమొయ్యా కోపం వచ్చేసింది. ''వెధవలు. మా డబ్బు మాకివ్వ ఇయ్యటానికింత పొగరా ?... వీళ్ల బాబుగారి సొమ్ములాగ ఎంత తిప్పుతారు ?... కుక్కని తిప్పినట్లు.'' లోపల అనుకోబోయి పైకే అన్నాడు గట్టిగా. స్టాఫ్ రూంలో ఏవో పేపర్లు దిద్దుకుంటున్న శర్మ, ''ఏమిటోయ్! ఏవయింది ?'' అన్నాడు. విషయం వివరించాడు రామచంద్రం. ''నే చెప్పలా ? వాళ్లకో పదో పరకో పడేయందే పని కాదనీ !'' కళ్లజోడు తీసి పాడుం గట్టిగా పీల్చి అన్నాడు శర్మ. ఆ మాటకి శర్మమీద విరుచుకుపడబోయిన రామచంద్రం విరుచుకుపడలేదు. శర్మకి పై ఆఫీసు వాళ్లతో బాగా పరిచయం ఉంది. అందునుంచి తనద్వారా కాకుండా ఏ పనీ జరగనివ్వడని స్టాఫులో అందరూ అంటారు. వస్తున్న కోపాన్నీ, దుఃఖాన్నీ దిగమింగుకొని, ''మరయితే ఇప్పుడవుతుందా ? ఆ పదో, పరకో వాడి ముఖాన కొడితే.'' ఆశతో అన్నాడు.

''ప్రయత్నించాలి !'' మళ్లీ తన పనిలో మునిగిపోతూ అన్నాడు శర్మ. శర్మతో తనకు ఏడేళ్ల పరిచయం. శర్మని టీచరు పోస్టులో ఉంచారుకాని... నిజానికతను క్లర్కు పోస్టులో ఉండాల్సినవాడు. ఇంకా చెప్పాలంటే ఏ తాలూకాఫీసులోనో ఉండాల్సినవాడు అందునుంచి ఆఫీసు విషయాలన్నీ తనే స్వయంగా చూస్తుంటాడు కాని — ఏ పనీ పేచీలేకుండా చెయ్యటం అతని కలవాటులేదు అయితే ఒక విషయం మాత్రం చెప్పుకోవాలి. తక్కిన కొంతమందిలాకాకుండా డబ్బు తిన్నా పని చేస్తాడు చేయిస్తాడు అందుకే శర్మని పరోక్షంలో తిట్టినా, ప్రత్యక్షంగా ఏమీ అనలేరు. ప్రాధేయపడతారు. అలా ప్రాధేయపడే ముందు మాత్రం శర్మ ఇలానే బిర్రబిగుస్తాడు. మరో కొంత ఎక్కువ లాగటానికి.

''మరలా అంటే వీల్లేదు. మీరెళ్లి పని జరిగేటట్టు చూడాలి. డబ్బు చాలా అవసరం ఉంది. ముఖమాటం లేకుండా ఎంతో చెప్పండి. ఇప్పుడే ఇచ్చేస్తా, హిందీ మాష్టారి దగ్గర తీసుకుని.'' అని రామచంద్రం అనగానే శర్మ దిద్దుతున్న పేపర్లు దిద్దటం మానేసి, కట్ట కట్టేసి కొంతసేపు నానుస్తూ, ''మొదటే మీరా పని చేస్తే బాగుండేది వాళ్లని ఒప్పించటం కష్టం. అయినా ప్రయత్నిస్తా ఓ ఇరవై ఇవ్వండి. రామ్మూర్తి బి. ఇడి. అప్‌గ్రేడ్ విషయం కూడా కనుక్కోమని బతిమాలుతున్నాడు. పనిలో పని. రేపు శనివారం వెళ్లి చేయించు కొచ్చేస్తా.'' అన్నాడు.

రామచంద్రానికి నాలుగొందలు పి.ఎఫ్ లోనుకి ఇరవై రూపాయలు కట్నం ఇచ్చుకోవటం కష్టమే అనిపించినా ఆ పరిస్థితుల్లో ఇష్టంగానే భావించాడు మారు మాటాడ కుండా హిందీ మాష్టార్ని అడిగి ఇరవై రూపాయల నోటుని శర్మ చేతిలో ఉంచాడు.

రామచంద్రానికిలాటి విషయాలు బొత్తిగా నచ్చవు. అయినా ఇది తప్పనిసరి పరిస్థితి. మెరిసే జానకి కళ్లు నిరాశతో వాలిపోరాదు. ఎనిమిదేళ్ల తన సాహచర్యంలో — ఆలోచించి చూస్తే తన వల్ల జానకి ఏం సుఖపడలేదనే చెప్పాలి. లేచిన దగ్గర్నుంచీ తనకీ పిల్లలకీ, అత్తమామలకి ఊడిగం చేసే సరికే జానకికి సరిపోతుంది. మరో సుఖంలేదు. మరో ఆనందంలేదు. వినోదంలేదు. అప్పుడు ఏదో చిరాకుతో తను చిర్రు మంటాడు. ఏదో మిషతో అమ్మ సాధిస్తుంటుంది. పిల్లలు అది కావాలీ, ఇది కావాలీ అని గోల చేస్తుంటారు. వీటన్నిటినీ పాపం జానకే భరించాలి. అయినా వీలయినంతవరకూ ముఖంలో విసుగుదలని కనిపించనివ్వదు. అలాటి జానకి సంవత్సరం క్రితం ఓ రాత్రి తనతో అంది. ''బొత్తిగా బోరుగా ఉంది. ఈ సారి వేసవికి ఎక్కడికయినా తిరిగి వద్దామండీ.'' అని అన్నప్పుడు కళ్లల్లో కనిపించని భయం కనిపించింది. కానీ...గత సంవత్సరం చెల్లెలి పెళ్లి. ఎక్కడి కెళ్లటానికీ వీలులేక పోయింది. ఈ వేసవి కయినా జానకికి కాస్త రిలీఫు కలిగించకపోతే లాభంలేదు. కన్నవారి వల్లా...కట్టుకున్న వారివల్లా కూడా జానకి సుఖానికి నోచుకోలేకపోయింది. కట్నం విషయంలో పేచీ వచ్చి

# అయినవాళ్లు

పరిస్థితి బాగులేదని.'' అన్న మాటలు జానకీ, రామచంద్రం కూడా విన్నారు. విని చలనంలేని మనుషుల్లా వుండిపోయారు. కొంతసేపయినాక జానకే అంది. ''ఏమండీ! రేప్పొద్దున్న బయల్దేరి పోదామండీ. మన కిళ్లూ... వాకిళ్లూ లేవనో... తిండిలేకనో వచ్చాం అనుకుంటున్నారేమో ... వీళ్లంతా. ఛీ... ఛీ... సభ్యతలేని మనుషులు. ఈసారి చచ్చినా ఇంట్లోంచి కదల్ను. నానుంచి మిమ్మల్ని కష్టపెట్టేసానవసరంగా. ఎలానూ వచ్చేసాం. కాబట్టి రేపోసారి తోటపల్లి దేవుణ్ణి దర్శించుకునిపోదాం. మీకు నమ్మకంలేదుకాని, నాకోసం రండి వెళ్దాం కోవెలకి'' అంది జానకి. జానకి మనసెంత కష్టపడిందో ఆ మాటవల్ల ఊహించుకోగలిగాడు రామచంద్రం. 'అలాగే' అన్నాడు. మరునాడు నాలుగ్గంటలకే జానకి రామచంద్రాన్ని లేపేసి పిల్లలకి స్నానాలు చేయించేసి ప్రయాణానికి సిద్ధమయిపోయింది. సరళ ఒక్కపూట ఉండమని కన్నీరు ఒంచుకున్నా జానకి ఉండకపోవటం రామచంద్రానికి ఆశ్చర్యం వేసింది. అయినా ఏం మాటాడలేదు. తోటపల్లిలో దిగి శ్రీనివాసుణ్ణి దర్శించి సత్యం మెట్లమీద కూర్చుని కొబ్బరికాయ కొడుతుంటే జానకి అంది. ''ఏమండీ! ఈ నాలుగొందలూ ఉంటే హాయిగా మరో ఖర్చు గట్టెక్కును. మరెప్పుడూ అయినవాళ్ల దగ్గరకంటూ వెళ్లరాదు సుమండీ!'' అంటుంటే ''అలాగే'' అంటూ కొబ్బరికాయ ముక్కని ఒలుస్తున్నాడు. ఇంతలో ''ఓహో! చంద్రం అన్నయ్యా!'' అంటూ తమదగ్గరకెవరో దంపతులు రావటంతో కళ్లెత్తి ఆశ్చర్యంగా చూసింది జానకి.

''హల్లో! సీతా...ఎక్కడ? ఎక్కణ్ణించిలా?'' అన్నాడు కొబ్బరికాయముక్కని పట్టుకొని. ఇదంతా చూస్తూ ఆశ్చర్యపోతున్న జానకిని ''ఒదినా! నా గురించి మా చంద్రం ఎప్పుడూ చెప్పనేలేదా? అవున్లే. ఎందుకు చెపుతాడు? పెద్దవాడయిపోయాడుగా! అన్నట్టు... చెప్పటం మర్చిపోయాను... వీరు మీ అన్నయ్య. పేరు మురళీకృష్ణ. ఇతనిగురించే నేను చెప్తుంటాను. చంద్రం అన్నయ్యని నా క్లోజ్ ఫ్రెండు. ఇప్పుడుత్తరం అయినా వ్రాయని రాయని భాస్కరుడు.'' అని అంతలోనే భర్తవేపు తిరిగి పరిచయం చేస్తున్న సీతని చూచి ఆశ్చర్యంలో మునిగిపోయింది జానకి. అందరూ నవ్వారు సీత మాటలకి.

''జానకీ! ఇదిగో. ఈవిడే సీత. నా పెళ్లికి రాలేదులే. అందుకే నీకు తెలియదు.'' అని ఇంకా రామచంద్రం అంటూండగానే ''సాధించేసావ్‌గా! నా పెళ్లికి రాకుండా. మేం పార్వతీపురంలో ఉంటున్నామన్న విషయమే గుర్తులేదా?'' అని సీత అన్నంతవరకూ రామచంద్రానికా విషయం గుర్తురాలేదు. ''సారీ. సీతా! నిజంగా నాకు గుర్తులేదు. ఏంటో... చాలా చిరాకెత్తిపోయా. మొన్న పార్వతీపురంలో దిగాంకూడా.'' ఎపాలజీ చెప్పుకుంటున్నట్లు అన్నాడు.

''సర్లే. మీ అన్నయ్యని సాధించాలంటే అలా రోడ్డుమీదకి తీసుకుపోయి నిలబెట్టి సాధించుకో. నేనూ మా చెల్లీ పోతాం. పదమ్మా.'' అన్నాడు మురళీకృష్ణ.

''అబ్బ. మీ చెల్లెమ్మ కందిపోతుందనా?'' అని ''పదండి. బస్సొచ్చేస్తోంది.'' అని, ''ఇంకోసారి వస్తామండీ ప్లీజ్. పిల్లలు...'' అని జానకి ఇంకేమో అనబోతుంటే ''వీల్లేదు. ముందు పదండి'' భార్యాభర్తలిద్దరూ కసిరినట్టుగా అని బస్సుకోసం పరుగెత్తారు. ఇంటికెళ్లాక సీత చేసిన ఆర్భాటం మండిపోతున్న హృదయానికి చల్లని మందులా అనిపించింది. మురళీ రామచంద్రం కబుర్లలో పడిపోయారు. సీత వాళ్ల హైస్కూలునాటి కబుర్లు చెపుతోంది జానకితో. అన్నీ వింటూ కళ్లప్పగించి ఉండిపోయింది జానకి. సీతావాళ్లూ కాస్త డబ్బున్న వాళ్లకున్న అన్ని హంగులతో వున్నారు. కానీ వాళ్లలో వెదికి చూసినా ఎక్కడా గర్వం కనిపించలేదు. చెప్పలేని ఆప్యాయతా ... అభిమానం మాత్రం కన్పిస్తోంది. ఒక్కసారి తమవాళ్లంతా వికృతరూపాల్తో కనిపించినట్లయింది. సీత ఏమిటో మాటాడుతోంది. సీత జానకి ఆఖరి కొడుకుని ఒళ్లో కూర్చోపెట్టుకుని అన్నం తినిపిస్తోంది. ''ఎప్పట్నించో రావాలనుకుంటున్నాం. ఈయనకి సెలవు కుదరటంలేదు. దసరా సెలవలకొస్తాం లెండి'' అంటోంది. అని ఏదో ఆలోచిస్తోన్న జానకిని చూసి ''ఏమిటీ! అలా కూర్చుండిపోయారు? ఏంటాలోచిస్తున్నారు?'' అనటంతో సిగ్గుపడిపోయి ''అబ్బే, రాత్రి సరిగా నిద్రలేదు. కళ్లమీద నిద్ర ముంచుకొచ్చేస్తోంది.'' అనగానే ''సారీ! పిల్లల భోజనాలవగానే మంచాలేసేస్తా. హాయిగా పడుకుందురుగాని. సాయంకాలం కబుర్లు చెప్పుకుందాం.'' అనేసరికి జానకికి మరీ సిగ్గనిపించి ''అబ్బే, ఫరవాలేదండీ! అదేమిటి? నే తినిపిస్తాలెండి,'' అంటున్నా వినిపించుకోక ''ఫరవాలేదు. మీ ఇంటికొస్తాంలెండి. అప్పుడు మేం దర్జాగా కూర్చుంటాం. మీరు సేవలు చేదురుగాని.'' అని అంటున్న సీతను దగ్గరకు తీసుకోవాలనిపించింది జానకికి. ఆ మర్నాడు రామచంద్రం బయల్దేరి పోతుంటే మురళీకృష్ణ, సీత ఒప్పుకోలేదు. ''పదిరోజులవరకూ మాటాడటానికి వీల్లేదు. ఆ తరువాత మీ ఇష్టంవున్నన్నాళ్లు వుండొచ్చు. లేదా వెళ్లొచ్చు.'' అని కదలనివ్వలేదు. వారంరోజులు దాటాక అతి ప్రయాసమీదకాని వాళ్లు ప్రయాణానికి ఒప్పుకోలేదు. బయల్దేరిపోయే ముందు రోజు మురళీకృష్ణ పిల్లల్ని బజారుకు తీసుకెళ్లి వాళ్లకు ఆటవస్తువుల్ని కొనిచ్చాడు. బయల్దేరిపోతుంటే సీత జానకి చేతులో పళ్లూ, రవికెలగుడ్డనీ వుంచింది. రామచంద్రానికి తమ్ముళ్ళు గుర్తొచ్చారు. జానకి రామచంద్రం కళ్ళలోకి చూసింది.

''తీసుకో వదినా! మా అన్నయ్యేమన్నా అంటే నేను బ్రతకనిస్తాననుకున్నావేమిటి?'' అంది సీత.

''ఇలాగే ఛస్తున్నానండీ, మీ చెల్లాయిని కట్టుకున్నదగ్గర్నుంచీ. బ్రహ్మరాక్షసి.'' అని మురళీకృష్ణ అంటుంటే ఫకాలున నవ్వాడు రామచంద్రం. జానకి సీత చుట్టూ చేయివేసి ''మా ఇంటికొస్తారుగా!'' అంది. ''మీలా మేం చెయ్యలేకపోయినా అభిమానంకి లోటుచెయ్యం.'' అనబోయే మాటలు గొంతులోనే వుండిపోయాయి జానకికి.

''తప్పకుండానమ్మా!'' అన్నాడు మురళి.

రామచంద్రానికి జానకికీ మనసునిండా వెన్నెల విరిసింది.

(నాకున్న కొద్దిపాటి మంచి మిత్రులకు ఈ కథ —రచయిత)

# పాకిస్తాన్ సినిమా

[ 32వ పేజీ తరువాయి ]

1978లో విడుదలయినప్పటికీ ఇటీవలి సంవత్సరాలలో ఇంతకుముందెన్నడూ ఎరుగని సంక్షోభాన్ని పరిశ్రమ ఎదుర్కొంటున్నదని చలనచిత్ర పరిశ్రమ వర్గాలవారి అభిప్రాయం. ఈ సంక్షోభానికి పరిష్కారమేమీ కనిపించని కారణాన 1979లో లాహోరు స్టూడియోలలో అంత ఎక్కువ పని జరిగేట్టు కనిపించడంలేదు.

చిత్రాలను నిర్మించడానికి నిర్మాతలు జంకుతున్నారు. మరొకచెంప స్టూడియో యజమానులు తమ స్టూడియోలను ఇప్పటికంటే ఎక్కువ లాభసాటిగా ఉపయోగించుకొనే ఉపాయాలను గురించి ఆలోచిస్తున్నారు. మరొకచెంప సినిమాహాల్స్ యజమానులు తమ భవనాలను అమ్మివేసి ఆ డబ్బుతో లాభసాటి వ్యాపారాలు చేయాలని ఆలోచిస్తున్నారు.

ఇంతకూ పాకిస్తాన్‌లో చలనచిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్య ఏమిటీ? చిత్రాల నిర్మాణం ఖర్చు చాలా పెరిగిందట. ఆ పెరుగుదలకు తగ్గ లాభాలు రావడంలేదట.

## బాలల మొదటి చిత్రం

పాకిస్తాన్‌లో బాలల గురించిన మొదటి చిత్రం ''లాలీపాప్''ను నిర్మించనున్నట్టు దర్శకుడు ఫరీద్ అహమద్ ప్రకటించాడు. బాబ్రా షరీఫ్ ఆ చిత్రంలో స్త్రీ పాత్రను పోషించుతుంది. పాకిస్తాన్‌లో పెంపుడుకుక్కలు నటించే చిత్రాలలో కూడా ఇది మొదటిదవుతుంది. ఈ చిత్రంలో అధికభాగం షూటింగ్ పాకిస్తాన్‌లో జరుగుతుంది. శ్రీలంకలో ఎనిమిదిరోజుల షూటింగ్ కూడా జరుగుతుందట. [ 'డాన్' పత్రిక సౌజన్యంతో ]

వి. ఎస్. అవధాని